

డిసెంబర్‌లోగా పనులు..

అన్ని రకాల అభివృద్ధి పనులను డిసెంబర్ లోగా పూర్తి చేయాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ అన్నారు.

వివరాలు 10లో ▸



ఏ సమస్యలు పరిష్కరించారు?

గత మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలపై అధికారులు ఏం పరిష్కరించారో చెప్పాలని సభ్యులు ప్రశ్నించారు.

వివరాలు 11లో ▸

నేటి నుంచి పోలీస్‌యాక్ట్

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో నేటి నుంచి 30వ తేదీ వరకు పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. తెలిపారు. ప్రజాధనానికి నష్టం కల్గించే కార్యక్రమాలు చేపట్టరాదని అన్నారు.

న్యూస్‌రీల్

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న సొసైటీ కార్యదర్శి సైదులు

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంజేపీ సొసైటీ కార్యదర్శి సైదులు సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులను మాట్లాడి హాస్టల్‌లో సమస్యలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధగా చదవాలని సూచించారు. సమస్యలుంటే ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. చదువుతోనే భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. విద్యార్థులకు మెరుగైన విద్యబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిబాబు, డిగ్రీ కళాశాల ఎస్‌ఓ జనార్దన్, ఏటీపీ సుష్మ, డిప్యూటీ వార్డెన్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్డుల విభజన త్వరగా పూర్తి చేయండి: డీపీఓ

హవేళిఘణాపూర్(మెదక్): ఓటరు జాబితాను వార్డుల వారీగా విభజించే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. శనివారం మెదక్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓటరు జాబితాను తయారు చేసి ఆయా పంచాయతీల్లో ఉంచి ఏమైనా ఫిర్యాదులుంటే స్వీకరించాలన్నారు. ఈనెల 6న ముసాయిదా ఓటరు లిస్టు జాబితాను త్వరగా పూర్తి చేసి అందుబాటులో ఉంచాలన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే వారిని వారి వార్డుల్లో నమోదు చేసే విధంగా చూడాలన్నారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ హన్మంతరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ: డీఏఓ

పాపన్నపేట(మెదక్): అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందుతుందని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. శనివారం ఆయన మండల వ్యవసాయధికారులతో కలసి పొడిచన్‌పల్లిలో ఇంటింటి సర్వే నిర్వహించారు. రేషన్‌కార్డు లేని రైతుల కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 713 రైతులకు రేషన్‌కార్డులు లేవని, వారి వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. రూ. 2 లక్షలకు పైగా రుణాలున్న వారు ఎప్పుడు డబ్బులు చెల్లించాలన్న ఆదేశాలు రాలేదన్నారు. బ్యాంకు ఖాతాకు, ఆధార్ లింక్ సరిపోని వారి విషయంలో పరిశీలన జరుగుతుందన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి నాగమాధురి, ఏఈఓ జనార్దన్ ఉన్నారు.

షీటీమ్స్‌తో మహిళలకు భరోసా

మెదక్ మున్సిపాలిటీ: షీటీమ్స్ మహిళలకు భరోసా కల్పిస్తున్నాయని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నెలరోజులుగా జిల్లాలో షీటీం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల గురించి వివరించారు. 4 కేసులు, 1 ఈపెట్టి కేసుతో పాటు తూప్రాన్ సబ్ డివిజన్‌లో 9, మెదక్ సబ్ డివిజన్‌లో 11 మందిని పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. షీటీం బృందాలు జిల్లాలోని 115 హాట్‌స్పాట్‌లను 161 సార్లు సందర్శించాయన్నారు. అలాగే ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, తెలంగాణ మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్, కేజీబీవీ స్కూళ్లలో విద్యార్థులకు 24 అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. బాలికలు, మహిళలు అత్యవసర సమయంలో 100 లేదా షీటీం వాట్సాప్ నంబర్లు 8712657963, 6303923823, పోలీస్ కంట్రోల్ రూం 8712657888 నంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణం స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

కొనసాగుతున్న పంపింగ్

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల పంపింగ్ కొనసాగుతోంది. నాలుగు మోటార్ల ద్వారా 5 రోజుల్లో 2.30 టీఎంసీల నీటిని పంపింగ్ చేసినట్లు ప్రాజెక్టు డీఈ చెన్ను శ్రీనివాస్ తెలిపారు. ఇందులో 1.50 టీఎంసీల నీటిని కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌కు తరలించారు. మల్లన్న సాగర్‌లో ప్రస్తుతం 0.80 టీఎంసీల నీరు చేరడంతో 11.10 టీఎంసీలకు చేరింది.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: భారీ వర్షసూచన నేపథ్యంలో వాతావరణశాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిందని.. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. శనివారం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోబోయే మూడు రోజులు భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయన్న సమాచారం మేరకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏదైనా ప్రమాదం జరిగితే 9391942254 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. అలాగే ఆయా మండలాల్లో సైతం కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి ప్రజలు నివాసం ఉండకుండా తరలింపు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు రైతులు వ్యవసాయ పనులకు పోకూడదన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎంహెచ్ఓ శ్రీరాం, డీపీఓ యాదయ్య, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌తో పాటు అన్ని మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

పీఠం దక్కేదెవరికో?

పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి తీవ్ర పోటీ

పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఆసక్తికరమైన పోటీ నెలకొంది. రేసులో తల్లీ కొడుకులు.. బావాబామ్మర్దులు, డీలర్లు, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు. చైర్మన్ పదవి ఎస్సీవర్గానికి రిజర్వు కావడంతో పోటీ పరిమితంగానే ఉన్నా.. ఎనిమిది మంది తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు మద్దతు సంపాదించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. పాపన్నపేట(మెదక్):



ఎస్సీ వర్గానికి రిజర్వు

జిల్లాలో అతి పెద్ద మండలం పాపన్నపేట. 40 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చుట్టూ మంజీర నది ఉండడంతో వ్యవసాయపరంగా అభివృద్ధి చెందింది. 2016లో ఏర్పడిన మార్కెట్ కమిటీకి ఎస్టీ వర్గానికి చెందిన రవీందర్‌నాయక్ చైర్మన్ అయ్యారు. 2018లో రెండోసారి జనరల్ కావడంతో పోలీస్ వెంకట్‌రెడ్డి చైర్మన్‌గా నియామకం అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక, వారి పదవీకాలం ముగియకముందే 2021 జనవరిలో పాలకమండళ్లను రద్దు చేసింది. ప్రస్తుతం చైర్మన్ పదవి ఎస్సీ వర్గానికి రిజర్వు అయింది. సుమారు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇంతకాలం పదవులకు దూరంగా ఉన్న ఎనిమిది మంది పోటీదారులుగా తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయం ప్రకారం ఇన్‌చార్జి మంత్రులు పాలకవర్గాల పేర్లను సూచిస్తూ వ్యవసాయశాఖకు లేఖలు పంపుతారు. సంబంధిత కాంగ్రెస్ ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకు పంపిన సిఫారసు లేఖల ఆధారంగా వ్యవసాయశాఖ మంత్రి ఆమోదంతో పాలకవర్గాలు ఏర్పాటు కానున్నాయి.

ఆశావహుల తీవ్ర ప్రయత్నాలు

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం పాపన్నపేట మండలం అర్కెల నుంచి మాజీ ఎంపీపీ చిట్యాల వినోద, ఆమె బావ కొడుకు అడ్వకేట్ మధుసూదన్‌తో పాటు అదే గ్రామానికి చెందిన డీలర్ శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. మిన్‌పూర్ గ్రామం నుంచి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన అల్లారం రత్నయ్యతో పాటు ఆయన బావ గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన అల్లారం క్రీస్తుదాస్ చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే యూసుఫ్‌పేట నుంచి సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయిన సూర్యరావు, బేగరి బాబు, నాగ్సాన్‌పల్లి నుంచి దండెం దుర్గేష్ చైర్మన్ సైతం పదవి ఆశిస్తున్నారు. వీరంతా తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కాగా మండల నాయకుల అభిప్రాయం తీసుకున్న తర్వాతే అభ్యర్థి ఎంపిక జరపనున్నట్లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆశావహులకు సంకేతాలు ఇస్తున్నారు.

సీపీఎస్ మాకొద్దు..!

- ఏళ్లుగా ఉద్యోగుల పోరాటం
- స్పందించని ప్రభుత్వాలు
- నేడు టీఎన్‌జీఓ ఆధ్వర్యంలో విద్రోహదినం



మెదక్ కలెక్టరేట్: 'సీపీఎస్ విధానం తీసుకొచ్చి ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయుల భద్రతకు భరోసా లేకుండా చేశాయి. యవ్వనమంతా సేవలందిస్తే వృద్ధాప్యంలో బతుకు భారంగా మారుతోంది. అనారోగ్య సమస్యలతో వైద్యం చేయించుకోవాలన్న కష్టంగా మారే పరిస్థితి ఉంది. ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబానికి ఆసరా లేకుండా పోతోంది'. ఇది 2004 సెప్టెంబర్ 1 తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన ప్రతి ఒక్కరి ఆవేదన. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఏళ్ల తరబడి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలు చేస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ ప్రభుత్వాలు స్పందించడం లేదు. ఈక్రమంలో ఆదివారం జిల్లా కేంద్రంలో టీఎన్‌జీఓ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్ నుంచి రాందాస్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ చేపట్టనున్నారు. జిల్లాలో పదివేల పైచిలుకు ఉద్యోగులు ఉండగా.. ఇందులో ఉపాధ్యాయులు 3,500, నాన్ గెజిటెడ్ 5,000, గెజిటెడ్ అధికారులు 1,000, ఫోర్త్‌క్లాస్ ఉద్యోగులు 1,000 వరకు ఉన్నారు. ఇందులో సీపీఎస్ ఉద్యోగులే అత్యధికంగా ఉన్నారు. ఇదే విషయమై టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, అప్పటి వరకు పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొంత మేలు

ఇటీవల కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం కేంద్రం ఏకీకృత పెన్షన్ స్కీం అమలు చేయనున్నట్లు ప్రకటించింది. దీని వల్ల కేంద్ర పరిధిలోని ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత జీతంలో సగం పెన్షన్‌రూపంలో ఇవ్వనున్నారు. దీంతో ఉద్యోగులకు కొంత మేర ప్రయోజనం చేకూరనుంది. కాని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం లేకుండా పోయింది.

మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్

కొల్చారం(నర్సాపూర్): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలకేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. వైద్యాధికారి హర్ష, ఆస్పత్రి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్ అనుమతి లేకుండా విధులకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని ఫార్మసీ గదిని పరిశీలించి అందుబాటులో ఉన్న మందులపై ఆరాతీశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై మహిళలకు రక్తహీనత రాకుండా ఐరన్, ఫోలిక్ యాసిడ్, టాబ్లెట్లు, సిరప్‌లు ఇవ్వాలని ఆదేశించారు. సెప్టెంబర్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న తరుణంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం, వీధులను పరిశీలించారు. ఇళ్ల ముందు నీటి నిల్వలపై పంచాయతీ కార్యదర్శి అంజయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రతి రోజు తిరుగుతూ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ కృష్ణవేణి, తదితర అధికారులు ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు: ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: శాంతిభద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం మెదక్ పట్టణం, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి అవుసులపల్లి వద్ద తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో 45 మంది పోలీస్ అధికారులతో ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కాలనీల్లో ఎవరైనా కొత్తవారు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉంటే వెంటనే డయల్ 100కు లేదా సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీలతో దొంగతనాలు, నేరాలు తగ్గుతాయని, ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని తెలిపారు.



అవుసులపల్లి వద్ద పోలీసుల తనిఖీలు

వ్రత వైభవం



రాష్ట్రంలో సుప్రసిద్ధమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం శ్రావణశోభ సంతరించుకుంది. శుభకర శ్రావణమాసంలో చివరి శనివారం కావడంతో వర్షపు జల్లులు లెక్కచేయకుండా హైదరాబాద్ జంట నగరాలు, మెదక్, సిద్దిపేట జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. హరిద్రవాగు నదిలో, ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు. దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతమాచరించారు. శ్రీలక్ష్మీనృసింహునికి నిజాభిషేకం, కల్యాణం జరిపించి మొక్కులు తీర్చుకున్నారు. గర్భగుడిలో కొలువైన స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. క్షేత్రంలో 60 సత్యనారాయణ వ్రతాలు, 9 నిజాభిషేకాలు, 18 స్వామివారి కల్యాణాలు జరిగాయని ఈఓ అన్నపూర్ణ తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు.

వర్గల్(గజ్వేల్):

ఆటాడుకుందాం రా...!

సండే స్పెషల్

- క్రీడలపై పెరుగుతున్న ఆసక్తి
- పటాన్‌చెరు నియోజకవర్గంలో మైదానాలకు భారీ డిమాండ్
- స్థలాలను అద్దెకిస్తున్న నిర్వాహకులు
- అభివృద్ధికి నోచుకోని ప్రభుత్వ మైదానాలు

చిన్నారులు, యువకులు విద్యతోపాటు క్రీడల్లో ఆసక్తి చూపిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నిరంతరం మైదానాలకు వెళ్లి శిక్షణలను తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడా మైదానాలు కిక్కిరిసిపోతున్నాయి. మైదానాలకు డిమాండ్ పెరగడంతో కొందరు నిర్వాహకులు అద్దెకు ఇస్తున్నారు.

పర్స శ్రీనాథ్
రామచంద్రాపురం (పటాన్‌చెరు)



10లో

మూత'బడి'నవి

- జిల్లాలో ఇప్పటివరకు 27 పాఠశాలల మూసివేత
- మసకబారుతున్న సర్కారు విద్య
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత



ఈ చిత్రంలో కనిపిస్తున్న ప్రాథమిక పాఠశాల కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి పంచాయతీ పరిధిలోని అంబాజీ తండాలోనిది. విద్యార్థులు లేరనేసాకుతో దీనిని గత నెల మూసివేశారు. ఇందులో ముగ్గురు విద్యార్థులు ఉండగా, ఇద్దరు హాస్టల్స్‌కు వెళ్లగా మరో విద్యార్థి ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నాడు. గత రెండేళ్లుగా జిల్లాలో 24 ప్రభుత్వ బడులు మూతపడగా, ఈ ఏడాది తాజాగా మరో మూడు మూతపడ్డాయి. ఫలితంగా సర్కార్ చదువుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా 897 పాఠశాలలు ఉండగా ఇప్పటివరకు 24 పాఠశాలలను మూసివేశారు. 2023లో విద్యార్థుల సంఖ్య 84 వేల పైచిలుకు ఉండగా, ఈ ఏడాది 68,025కు చేరుకుంది. ఈలెక్కన 15,975 మంది విద్యార్థులు తగ్గారు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల కల్పన సరిగా ముందుకురావడం లేదు. విద్యార్థులు లేరనే కారణం చూపుతూ అధికారులు పాఠశాలలను మూసేస్తున్నారు.

183 ఏకోపాధ్యాయ పాఠశాలలు

జిల్లాలో 897 పాఠశాలలు ఉండగా 183 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చదువు చెప్పే టీచర్‌కు కాంప్లెక్స్ మీటింగ్ ఉన్నా, ఆరోగ్య సమస్య వచ్చినా ఆరోజున పాఠశాల తెరుచుకోవడం లేదు. అంతేకాకుండా జిల్లాలో 655 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నాయి.

సౌకర్యాలు అంతంతే..

జిల్లాలోని 897 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటిలో చాలావరకు సరైనా సౌకర్యాలు లేవు. టాయిలెట్స్, తాగునీటి సమస్య, కిచెన్‌షెడ్లు, ప్రహరీ తదితర సమస్యలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. దీంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో గత ప్రభుత్వ హయాంలో వసతుల కల్పన కోసం మన ఊరు– మన బడి పథకాన్ని ప్రవేశపెట్టి 313 పాఠశాలల్లో మరమ్మతులు ప్రారంభించి చిన్నా, చితక మరమ్మతులు చేశారు. మరో 213 పాఠశాలలను అర్ధాంతరంగా వదిలేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాత పనులను పక్కన పెట్టి అమ్మ ఆదర్శ పథకం పేరుతో 562 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు 512 పాఠశాలల్లో పనులు చేశారు. ఇంకా 50 పాఠశాలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉంది. అర్ధాంతరంగా పనులు నిలిపివేయడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. అయితే ఏటా బడిబాట నిర్వహిస్తున్నా పెద్ద గా ప్రయోజనం లేకుండా పోతోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్కారు బడుల్లో వసతుల కల్పనతో పాటు సరిపడా బోధనా సిబ్బందిని నియమించినప్పుడే సర్కారు బడులపై సామాన్యులకు నమ్మకం కలుగుతుందని చెబుతున్నారు.

కాంగ్రెస్ బెదిరింపులకు భయపడం



బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి
- సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో రసాభాస

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ బెదిరింపులకు భయపడమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శనివారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రసాభాస చోటుచేసుకుంది. స్టేజీపై ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రామాగౌడ్, మాజీ ఎంపీపీ రాజు, మాజీ సర్పంచ్‌లు మహిపాల్‌రెడ్డి, ఎల్లం తదితరులు కూర్చోవడంపై కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ పాటించకుండా స్టేజీపై ఎలా కూర్చుంటారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాహెబ్ పాష, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు అడ్డుకున్నారు. దీంతో ఇరుపార్టీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే డౌన్‌డౌన్ అంటు నినాదాలు చేశారు. దీంతో ఎస్ఐ రంజిత్‌రెడ్డి రంగంలోకి దిగి ఇరువర్గాలను సముదాయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రోటోకాల్ ఎవరికైనా వర్తిస్తుందన్నారు. చెక్కుల పంపిణీని కాంగ్రెస్ అడ్డుకుంటుందని, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటంతో ఉన్న సీఎంఆర్‌ఎఫ్ చెక్కులనే ఇస్తున్నామని తెలిపారు. కాగా కాంగ్రెస్ మంత్రులు, నాయకులు పాల్గొనే ఏ కార్యక్రమాన్ని అయిన బీఆర్ఎస్ నాయకులు అడ్డుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

యోగా పోటీల్లో విద్యార్థుల సత్తా



పతకాలతో విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: సిద్దిపేటలో జరిగిన ఐదవ జిల్లా స్థాయి యోగా పోటీల్లో గజ్వేల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా శనివారం గజ్వేల్‌లో యోగా టీచర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగాసన భారత్ సహకారంతో జరిగిన పోటీల్లో బంగారు పతకంతో పాటు కన్సోలేషన్ బహుమతులను అందుకున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో యోగా టీచర్ బీ. శ్రీప్రసన్న బంగారు పతకంతోపాటు సాయి జీడీఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థి శ్రీకరణ్, ప్రగతి సెంట్రల్ స్కూల్‌కు చెందిన సాదియ బేగం, మంజీరా స్కూల్‌కు చెందిన త్రిపుర, వేద స్కూల్(కుకునూర్‌పల్లి)కి చెందిన ఆనంద్ కన్సోలేషన్ బహుమతులను అందుకున్నారన్నారు. వీరితో పాటు మరో 15మంది ప్రశంసాపత్రాలను పొందినట్లు తెలిపారు.

దుబ్బాక అభివృద్ధికి కృషి

-మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



పొన్నం ప్రభాకర్‌తో నాయకులు

దుబ్బాక: నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మంత్రిని కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై విన్నవించారు. తప్పకుండా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులతోపాటు కొత్తగా చేపట్టనున్న పనులకు సంబంధించి నిధుల మంజూరికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

ఆటాడుకుందాం రా..!

- క్రీడలపై పెరుగుతున్న ఆసక్తి

పటాన్‌చెరు నియోజకవర్గంలో అనేక క్రీడా మైదానాలు, అకాడమీలు ఉన్నాయి. రోజురోజుకూ వీటికి డిమాండ్ పెరిగి ప్రాంగణాలన్నీ కిక్కిరిసిపోతున్నాయి. దీంతో మైదానాల అవసరం ఎక్కువ కావడంతో కొందరు క్రీడా అకాడమీలను ఏర్పాటు చేసి ఉపాధి పొందుతున్నారు. క్రీడా ప్రాంగణంలోని సౌకర్యాలు, కోచ్‌ను బట్టి అక్కడికి వచ్చే వారి నుంచి ఫీజులను వసూలు చేస్తున్నారు. కొంత మంది క్రీడా మైదానాలను గంటల వారీగా కూడా అద్దెకు ఇస్తున్నారు. ఉద్యోగస్తులు సెలవు దినాల్లో స్థలాన్ని అద్దెకు తీసుకొని వారికి నచ్చిన ఆటలను ఆడుకుంటున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో చాలా మంది ప్రైవేట్ క్రీడా అకాడమీలను ఆశ్రయిస్తున్నారు.



డీజీఆర్ స్పోర్ట్స్ క్లబ్‌లో..



వాలీబాల్ ఆడుతున్న ఉద్యోగులు

క్రీడలతో ఆరోగ్యం, క్రమ శిక్షణ..

ఈ పోటీ ప్రపంచంలో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీంతో తల్లిదండ్రులు వారి చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్‌తో పాటు ఆరోగ్యం, క్రమశిక్ష వస్తుందని భావిస్తున్నారు. దానికి అనుగుణంగా అకాడమీల్లో చేర్పించే శిక్షణ ఇప్పిస్తున్నారు.

అద్దెకు క్రీడా మైదానాలు..

ఐటీ ఉద్యోగస్తులు సైతం క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నిత్యం పని ఒత్తిడితో ఉండేవాళ్లు సెలవు రోజుల్లో, సమయం దొరికినప్పుడు మైదానాలను అద్దెకు తీసుకొని ఆటలు ఆడుకుంటున్నారు. దీంతో నిర్వాహకులు ఉదయం, రాత్రి సమయాల్లో అద్దెకు ఇస్తున్నారు. అక్కడి సౌకర్యాలను బట్టి మైదానాలకు అద్దె నిర్ణయిస్తున్నారు. క్రికెట్ ఆటకు గంటకు రూ.500, ఫుట్‌బాల్ క్రీడకు రాత్రి సమయంలో రూ.3,000, ఉదయం సమయంలో రూ.1,500, వాలీబాల్ క్రీడకు గంటకు రూ.500 రుసుము తీసుకుంటున్నారు.





సరైన గ్రౌండ్‌లు లేకనే..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం క్రీడా మైదానాలను అభివృద్ధి చేయకపోవడంతో అనేక మంది క్రీడలకు దూరమవుతున్నారు. ప్రధానంగా గ్రామీణ క్రీడాకారులు డబ్బులు ఖర్చు పెట్టుకొని ప్రైవేట్ క్రీడా ప్రాంగణాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. క్రీడా మైదానాలు లేకపోవడంతో ప్రైవేట్ క్రీడా అకాడమీలకు మంచి డిమాండ్ వచ్చింది.

ప్రైవేట్ క్రీడా అకాడమీలకు డిమాండ్..

అనేక మంది యువకులు, క్రీడాకారులు అకాడమీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు కోసం పట్టణ ప్రాంతలలో భూములను లీజుకు తీసుకొని క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తున్నారు. మంచి శిక్షకులతో శిక్షణ అందిస్తున్నారు. వాటికి ఆదరణ ఎక్కువగా ఉండడంతో అనేక మంది ఈ రంగం వైపు మొగ్గు చూపుతున్నారు. ఉపాధితోపాటు మంచి క్రీడాకారులను తయారు చేస్తున్నామన్న సంతృప్తి పొందుతున్నారు.

కోచ్‌లతో ప్రత్యేక శిక్షణ..

ప్రధానంగా క్రీడా అకాడమీలో నైపుణ్యం కలిగిన కోచ్‌లతో శిక్షణ అందిస్తున్నారు. మెరుగైన సౌకర్యాలు ఉన్న క్రీడా అకాడమీల్లో బ్యాడ్మింటన్‌కు గంటకు రూ.400, నెల శిక్షణకు రూ.7 వేలు, బాక్స్ క్రికెట్‌కు ఉదయం గంటకు రూ.700, రాత్రి రూ.1,000, స్నూకర్ క్రీడలకు గంటకు రూ.250, వాలీవాల్ క్రీడకు నెలకు శిక్షణకు రూ.2 వేలు, స్కేటింగ్‌కు నెలకు రూ.2వేలు, జిమ్నాస్టిక్స్‌కు శిక్షణకు నెలకు రూ.1,500 రుసుము తీసుకుంటున్నారు.



విద్యార్థికి క్రికెట్‌లో మెలకువలు నేర్పుతున్న కోచ్

క్రీడలపై ఆసక్తిని పెంచాలి



నేటి ఆధునిక యుగంలో చిన్నారులు ఎక్కువగా వీడియో గేమ్స్, సెల్‌ఫోన్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. వారికి చిన్ననాటి నుంచి క్రీడలపై ఆసక్తి పెంచితే భవిష్యత్ వారికి నచ్చిన క్రీడల్లో రాణిస్తారు. దీంతో చిన్ననాటి నుంచి రోజుకు రెండు గంటల సమయంలో క్రీడల కోసం కేటాయించడం అలవాటుగా మారుతుంది.

– పీ.నాగరాజు, ఎస్‌9 స్పోర్ట్స్ అకాడమీ, యజమాని తెల్లాపూర్

రెండేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ



మా కుమారుడు యశ్వంత్ శర్మ ఐదవ తరగతి చదువుతున్నాడు. రెండేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాను. నిత్యం సాయంత్రం రెండు గంటలు క్రికెట్ కోసం సమయాన్ని కేటాయిస్తున్నాడు. దీని వల్ల చిన్నారులు చురుగ్గా, ఆరోగ్యం ఉంటారు.

– చంద్రబాబు శర్మ, భారతీనగర్ డివిజన్

తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి



క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్ ఉంటుంది. చిన్నారులు విద్యతోపాటు క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అథ్లెటిక్స్‌లో జాతీయ, రాష్ట్రస్థాయిలో 30 మెడల్స్ సాధించాను.

– ఏ.శాంతరావు, అథ్లెటిక్స్ క్రీడాకారుడు, డీజీఆర్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్

పోరాటంతో హక్కులను సాధించుకోవాలి

– సాహసం రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్



మాట్లాడుతున్న ముప్పారం ప్రకాశ్

గజ్వేల్: పోరాట పటిమతో హక్కులను సాధించుకోవాలని సాహసం(సామాజిక హక్కుల సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముప్పరం ప్రకాశ్ అన్నారు. శనివారం గజ్వేల్‌లోని టీవైఆర్ లైబ్రరీ హాల్‌లో 'పదేళ్ల తెలంగాణ–ప్రజల స్థితిగతులు' అంశంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ప్రజలకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన హక్కులు అందటం లేదని, పాలకుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతుందన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. ఈ దుస్థితిని మార్చడానికి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రత్యేకించి సామాజిక హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఆవిర్భవించిన సాహసం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. హక్కులపై ప్రజా చైతన్యం కోసం నిరంతరం వివిధ కార్యక్రమాలతో ముందుకు సాగుతామన్నారు. టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ టీ.రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. సదస్సులో టీఎస్‌సీపీఎస్‌ఈయూ(తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్) రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్, సాహసం నాయకులు రమణాకర్, మల్లేశ్ యాదవ్, సోలమన్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా..

- కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలు



సంగారెడ్డి: ప్రమాదానికి గురైన కారు

సంగారెడ్డి: ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హత్నూర మండలం సిరిపురం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. గుమ్మడిదల మండలం దాచారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి అతడి భార్య నర్మద, కూతురు శ్రీనిధి, తల్లి భ్రమరాంబతోపాటు కుమారుడు నర్సాపూర్ నుంచి మెదక్ జిల్లా చిలిప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరి దేవి దర్శనానికి కారులో వెళ్తున్నారు. సిరిపుర గ్రామ శివారులోని తెల్లరాళ్ల తండా గేటు సమీపంలోకి రాగానే జోగిపేట నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు బోల్తా పడి నుజ్జునుజ్జయింది. ఇందులో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులు స్థానికులు ఆస్పత్రికి తరలించారు.. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి చెందాడు. ఈ ఘటన మండలంలోని గోవన్‌పల్లి క్రాస్‌రోడ్డు వద్ద చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సత్వార్ గ్రామానికి చెందిన పెంటప్ప (65) గ్రామం నుంచి సైకిల్‌పై వెళ్తూ జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

చికిత్స పొందుతూ ఖైదీ ..

సంగారెడ్డి టౌన్: చికిత్స పొందుతూ ఖైదీ మృతి చెందిన ఘటన సంగారెడ్డిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై వినయ్ కుమార్ కథనం మేరకు.. జిల్లాలోని రామచంద్రాపురం పీఎస్‌లో కేసు నమోదైన ఘటనలో అదే గ్రామానికి చెందిన మిద్దె మహేశ్(19)కందిలో గల జైలులో అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్నాడు. మహేశ్ కుమార్ అనారోగ్యానికి గురవడంతో 26న రాత్రి సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 30న అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. జైలు సూపరింటెండెంట్ భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలు

హుస్నాబాద్‌రూరల్: బావిలో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన హుస్నాబాద్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్ కథనం మేరకు. పొట్లపల్లి శివారు పల్లె దేవేందర్‌నగర్‌కి చెందిన జొన్నగడ్డల రామవ్వ(70) భర్త అంజయ్య పదేళ్ల కిందటనే మరణించగా కొడుకుల వద్దనే ఉంటుంది. అనారోగ్యంతో బాధపడుతున్న రామవ్వ శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి కోసం కొడుకులు ఇద్దరూ చుట్టు పక్కల వెతుకుతుండగా బావిలో కన్పించింది. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు బావి నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి...

మిరుదొడ్డి(దుబ్బాక): ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని అల్మాజీపూర్‌లో చోటు చేసుకుంది. శనివారం భూంపల్లి ఎస్‌ఐ హరీశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుర్మిళ్ల చంద్రయ్య (36) వ్యవసాయం చేసుకుంటూ మతిస్థిమితం లేని భార్య లక్ష్మి, కుమారుడు రమేశ్‌ను పోషించుకుంటున్నాడు. రెండు నెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రయ్య కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలై ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబ పోషణ భారం కావడంతో జీవితంపై విరక్తి చెంది 27న గుర్తు తెలియని గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నంది అవార్డుకు ఉపాధ్యాయుడు ఎంపిక



మల్లికార్జునగౌడ్

టేక్మాల్(మెదక్): విద్యా రంగంలో, నిరుపేద విద్యార్థులకు పలు రకాల సేవలు చేసినందుకు వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురు బ్రహ్మ బంగారు నంది అవార్డుకు టేక్మాల్ మండల కుసంగి గ్రామానికి చెందిన పత్తిగారి మల్లికార్జున గౌడ్ ఎంపికైనట్లు శనివారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల వెల్టూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న మల్లికార్జునగౌడ్‌కుఫౌండేషన్ ఆధ్వర్యంలో 8న రవీంద్రభారతీలో టీచర్స్ డే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా అవార్డు అందించనున్నట్లు పేర్కొన్నారు. 20 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలకు పలుమార్లు మండల, జిల్లా స్థాయి అవార్డులతోపాటు, లైయన్స్ క్లబ్, పలు ఫౌండేషన్‌ల అవార్డులు పొందినట్లు తెలిపారు. మల్లికార్జున్‌గౌడ్‌ను కుసంగి గ్రామస్తులపాటు తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

తనిఖీలకు వస్తున్నారని ముందే మూసేశారు

పాపన్నపేటలో ప్రథమ చికిత్స కేంద్రాల తీరు



నార్సింగిలో మూసివేసిన ప్రథమ చికిత్స కేంద్రం వద్ద వైద్యాధికారులు

పాపన్నపేట(మెదక్): డెంగీ కేసులు పెరుగుతున్న వేళ వైద్య బృందాలు శనివారం తనిఖీలకు రావడంతో ముందస్తు సమాచారం అందుకున్న ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రాలను మూసివేశారు. వివరాల్లోకి వెళ్తే.. పాపన్నపేట మండలంలో ఇటీవల డెంగీ కేసులు పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రథమ చికిత్స కేంద్రాల్లో జరుగుతున్న చికిత్సపై ఆరా తీసేందుకు జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ రమా ఆధ్వర్యంలో వైద్యాధికారులు తనిఖీలకి వచ్చారు. ఈ సమాచారాన్ని ముందస్తుగానే తెలుసుకున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తమ కేంద్రాలను మూసివేసి వెళ్లిపోయారు. ఆ కేంద్రాల్లో అనారోగ్యానికి గురైన వారికి కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సి ఉంటుందని, సెలైన్లు, స్టెరాయిడ్లు, యాంటీబయాటిక్ చికిత్స అందించొద్దని, ఇన్‌పేషెంట్ సేవలు చేసే అవకాశం లేదని, హెల్త్ ఎడ్యుకేటర్ రమా తెలిపారు. ల్యాబ్‌లను సైతం తనిఖీ చేశారు. ఆమె వెంట డీపీఎంఓ కోట, పీహెచ్‌సీఓ చందర్, సిబ్బంది, రాజశ్రీ, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్రీడా వేదికలను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మాట్లాడారు. విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడల పాత్ర ఎంతగానో ఉంటుందన్నారు. విద్యార్థులు శారీరక, మానసిక వికాసానికి ఇలాంటి క్రీడా వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, వాలీబాల్, చెస్ తదితర క్రీడల్లో పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ గోపాలసుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, క్రీడా కమిటీ సభ్యులు కృష్ణయ్య, బాలికిషన్, డా.హరిబాబు, డా.మేరాజ్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా పనులు పూర్తి చేయండి

- విద్యుత్‌శాఖలో చేపట్టిన అభివృద్ధిపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి
- టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ



మాట్లాడుతున్న ముషారఫ్ అలీ ఫరూఖీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్‌శాఖలో చేపట్టిన అన్ని రకాల అభివృద్ధి పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ అన్నారు. శనివారం జిల్లా విద్యుత్ భవన్‌లో ఎస్‌ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో వినియోగదారులతో విద్యుత్ సరఫరా, జీరో విద్యుత్ బిల్లు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిసరాల్లోని వ్యవసాయదారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా పై ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. విద్యుత్ డిమాండ్ సరఫరా, గృహ జ్యోతి పథకం అమలు, సర్కిల్‌లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఫరూఖీ మాట్లాడుతూ.. వినియోగదారులతో సంస్థ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదగా మాట్లాడాలన్నారు. రానున్న వేసవి సీజన్‌లో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే అవకాశముందన్నారు. ఫీల్డ్ అధికారులు విధిగా ట్రాన్స్ ఫార్మర్‌ల లోడ్‌ను చెక్ చేసి, ఓవర్ లోడైన వాటిని లోడ్ బ్యాలెన్సింగ్‌కు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్) డాక్టర్ నర్సింహులు, రూరల్ జోన్ చీఫ్ ఇంజినీర్ భిక్షపతి, సిద్దిపేట సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రమోహన్, డివిజనల్ ఇంజినీర్లు మహేశ్ కుమార్, లక్ష్మీ నారాయణ, శ్రీనాథ్, భాను ప్రకాశ్, ఏడీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జవాబుదారీగా పనిచేసే ప్రతీ అధికారి

- ప్రజల మన్ననలు పొందుతారు
- కలెక్టర్ రాహుల్‌రాజ్



కృష్ణమూర్తి దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: జవాబుదారీగా పనిచేసే ప్రతీ అధికారి ప్రజల మన్ననలు పొందుతారని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన పరిశ్రమల శాఖ అధికారి కృష్ణమూర్తి ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కృష్ణమూర్తి విధులపై నిబద్ధత, అంకిత భావం కలిగిన వ్యక్తి అని, ఐదేళ్లుగా విధులు నిర్వహించి తాను చేపట్టిన ఉద్యోగానికి వన్నె తెచ్చారని కొనియాడారు. అనంతరం జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన అధికారులు హెల్త్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీఎఫ్‌ఓ రవి ప్రకాశ్, హార్టికల్చర్ నర్సయ్య, డీఎస్‌ఓ బ్రహ్మ రావును కలెక్టర్ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీసీఈఓ ఎల్లయ్య, డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



రవి (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్):ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ నారాయణ కథనం మేరకు.. అంబాజీపేట గ్రామానికి చెందిన మల్ల రవి(48) ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. శుక్రవారం తన సోదరుడు దేవానంద్‌ను డబ్బులు అడుగగా తన వద్ద లేవని చెప్పాడు. దీంతో మనస్తాపం చెందిన రవి గవ్వలపల్లిలోని వైన్స్‌లో మద్యం తీసుకొని పురుగుల మందు కలుపుకొని సేవించాడు. అనంతరం భార్య సుమితకు ఫోన్ చేసి చెప్పాడు. బంధువులు అతడి వద్దకు చేరుకొని నార్సింగిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.